# పెద్దక్కయ్య

- డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు
నాగభైరవ కళాపీఠం, గుళ్ళపల్లి,
ప్రకాశం జిల్లా.

1987లో ననుకుంటాను. రవీంద్రభారతిలో ఉగాది కవిసమ్మేళనం జరిగాక, అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్. కవులను సన్మానిస్తున్నారు. అది తెలుగు విశ్వవిద్యాలయం వారు ఏర్పాటు చేసిన సభ. ఆనాడు కవితాగానం చేసిన వారిలో కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారు కూడా ఉన్నారు. ఎన్.టి.ఆర్ అన్నారు. "పెద్దక్కగారూ! రండి. మా సన్మానం స్వీకరించండి'' అని సభికుల కరతాళధ్వనుల మధ్య. ఆమె వచ్చారు. ఆయన పూలదండ యిచ్చి నమస్కరించి, మెమెంటో యిచ్చి, మహారాజుల విధంగా సంచీలో మూట గట్టిన వెయినూటపదార్లు వరకు రిజర్వుబ్యాంకు రూపాయి నాణేలు యిచ్చి, శాలువా కప్పి పునః నమస్కారం చేసినంత సేపు ఆయన ఏదో అంటూనే వున్నారు. ఈమె జవాబులు చెబుతూనే వుంది. ఛలోక్తులు విసురుతూనే వుంది; మా పెద్ద ఆడపడుచు'' ఆయన సభకి చెప్పినప్పుడు కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి. ఆ దృశ్యం నాకళ్ళల్లో యింకా నిత్యహరితం.

అప్పుడూ అంతకు పూర్వమూ, ఆతర్వాత అక్కయ్యతో చాలసభల్లో పాల్గొన్నాను. ఆమె పద్యం బాగారాస్తుంది. ఆమెకు గేయ కవిత్వం రాయాలని వాంఛ. 'నా తెలుగు మాంచాల' కావ్యమే రాసింది. పద్యంలో ఉండే పసందైన ఆమె పలుకుబడి గేయంలోనూ వచనగేయంలోనూ పలుకలేదు.

ఆమె బాపట్లలో ఉండేవారు. నేను ఉద్యోగించింది చీరాల ప్రభుత్వ స్త్రీల కలాశాలలో, ఒకసారి ఆమె కాలేజీకి వచ్చింది ఓ సభకి - ఓ ఛలోక్తి "ప్రభుత్వ స్త్రీల కళాశాల ఏమిటి? ప్రైవేటు స్త్రీలకు వేరే కళాశాలలుంటాయా ?'' అని నవ్వించారు.

నా "రంగాజమ్మ'' కావ్యానికి వస్తువు ఆమె ఆంధ్ర కవయిత్రులు గ్రంథంలోంచే ప్రధానంగా స్వీకరించాను. ఆమెకి చెప్పాను. కాని ఆమె ఆకావ్యం చదవనే లేదు. వీరరాఘవ పేటలో మెట్లన్నీ ఎక్కివచ్చి - మండువేసవిలో - తన పుస్తకాల కొత్త ముద్రణలను యిచ్చి పోయిన అక్కను ఎలా మరువగలం ? సాహిత్యంలో రాజీలేని ఉపన్యాసం చేసే విదుషీమణిని ఎలా మరువగలం ? ఆమె కవయిత్రిగా ఒక ఎత్తయితే - ఆమె తీర్చిదిద్దినవారు కవయిత్రులుగా వెలుగొందడం యింకో ఎత్తు, ఆమె ప్రోత్సాహం అలాంటిది. చిల్లర భవానీ దేవి, కోకా విమలకుమారి ఆమె ప్రోడక్ట్సే.

ఆమె ధన్యజీవి, స్థాయిగా రాసింది, గంభీరంగా బ్రతికింది. ఉదాత్తంగా ఉపన్యసించింది.

ఆమె 'ఆంధ్ర కవయిత్రుల' గ్రంథం చాలదూ ఆమెని కాలంలో బ్రతికించడానికి ?

# విదుషీమణి: ఆకాశవాణి

*- డా॥ ఆర్. అనంత పద్మనాభరావు*

మాన్యురాలు, కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ గారితో నా పరిచయం రెండు దశాబ్దాల నాటిది. 1978లో నేను విజయవాడ ఆకాశవాణిలో తెలుగు ప్రసంగ శాఖ ప్రయోక్తగా పని చేస్తున్నాను. ఆమె బహుముఖీన సాహితీ వైదుష్యాన్ని విని వున్నాను. కవి సమ్మేళనానికి ఆహూతుల సమక్షంలో వారిని ఆహ్వానించాం. కమ్రకంఠంతో, గళమెత్తి పద్యం చదివితే శ్రోతలు మంత్రముగ్ధులు కావలసిందే. భాష, భావము, అనుభూతి ముప్పిరిగొనినడిచేవి.

ఆమె 'ఆంధ్ర కవయిత్రులు' గ్రంథం ఆ కోవలో వచ్చిన గ్రంథాలలో మొదటిది. సాధికారికంగా అనేకమందిని ఒక చోట చేర్చి వారి జీవిత విశేషాలను వెలుగులోనికి తీసుకొచ్చారు. వారి కృషి అభినందనీయం.

ఆంధ్రదేశంలోని అన్ని సాహిత్య సంస్థలు, ఆకాశవాణి కేంద్రాలు వారిని ఆదరించి సత్కరించాయి. డా॥ బెజవాడ గోపాలరెడ్డి గారు ఆదరించిన రచయిత్రులలో లక్ష్మీకాన్తమ్మ గారొకరు. సాహిత్య అకాడమీ అనుబంధంతో ఆమె మరింత సాహితీ సేవ చేశారు.

1995లో నేను విజయవాడ కేంద్ర డైరెక్టరుగా మార్చిలో చేరాను. నెలాఖరులో ఉగాది కవి సమ్మేళనం తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో నిర్వహించాం. అందులో లక్ష్మీకాన్తమ్మగారు పాల్గొన్నారు. ఆమె కవిత హైలెట్. ఎంతో ఆదరంగా మాట్లాడారు. ఎన్నో సాహితీ విషయాలు ముచ్చటించుకొన్నాం. సౌమనస్యంగా జరిగిన సంభాషణ అది.

నిరంతర సాహితీ సేవ ధ్యేయంగా, మహిళాభ్యున్నతి లక్ష్యంగా సాహితీ నందనోద్యానాలలో నాలుగు దశాబ్దాలు విరబూసిన పారిజాతం ఆమె. ఆమె తనయ ఊటుకూరి సుహాసిని గారు సాహితీవేత్తకావడం హర్షదాయకం. నాళం కృష్ణారావుగారి పేర తెలుగు విశ్వవిద్యాలయంలో లక్ష్మీకాన్తమ్మగారు స్మారకనిధిని ఏర్పాటు చేసిన విషయం యిక్కడ స్మరించుకోవాలి. శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి, శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ, వంటి ప్రముఖ రచయిత్రుల తరానికి చెందిన లక్ష్మీకాన్తమ్మగారు